క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మద్దులేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో మద్దిలేరు వాగు ఉధృతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మద్దులేరుపై ప్రయాణం చేసే ముందు అప్రమత్తంగా ఉండాలన్నారు. 1వ వార్డు పీవీ నగర్ ప్రజలు, అటువైపు ప్రయాణించే వాళ్లు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో జిల్లా ఇమామ్‌ల సంఘం ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, ఉర్దూ సాహిత్య వేత్త సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం ఉర్దూ ఇన్‌స్పెక్టర్ అస్మాద్దీన్, ఫిరోజ్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ యూనివర్సిటీ అధ్యాపకులు మొయినుద్దీన్, సాహిత్య వేత్తలు సత్తార్ ఫైజీ, మగ్బుల్ అహమ్మద్, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థలు ఉన్న చోట మద్యం షాపులకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వరాదని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం వల్ల మహిళలు, చిన్న పిల్లలపై దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

'అగ్నివీర్'పై అవగాహన సదస్సు




మాట్లాడుతున్న సందీప్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐఏఎఫ్ ఆధ్వర్యంలో అగ్నివీర్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం ఇంటర్ వృత్తి విద్యాధికారిణి సునిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 12 ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్ సికింద్రాబాద్ ప్రతినిధులు సందీప్, సురేంద్రలు అగ్నివీర్ పరీక్ష విధి విధానాలను వివరించారు. ఐఏఎఫ్ చేరిన అగ్నివీర్‌లకు ఉండే ప్రోత్సాహక అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూమా హయాంలోనే 'విజయ' అభివృద్ధి

ఆళ్లగడ్డ : విజయ డెయిరీ అభివృద్ధి భూమా నాగిరెడ్డి హయాంలోనే జరిగిందని టీడీపీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీని సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శంగా తీర్చిదిద్దారని చెప్పారు. టెండర్లు పిలవకుండా అభివృద్ధి పనులు చేపట్టడం సరికాదన్నారు. నామినేషన్ పద్ధతిలో కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అలరించిన భక్తి సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం టి. నారాయణ భజన బృందం, కర్నూలు వారిచే భజన సంకీర్తనలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద భజన కార్యక్రమం జరిగింది. జయ గణనాయక, శివ శివశంకరా, నమశ్శివాయ, భజే మహేశం, జ్యోతిర్లింగస్వరూప, శివస్తుతి, నమో భూతనాథా, శివనామమే నా గానము, శ్రీశైలంలో వెలసిన మల్లన్న తదితర గీతాలకు జి. గోపాల్, శ్రీలక్ష్మి సులోచన, ఛాయాదేవి, నాగమణి, సత్యవతి, ఈశ్వరయ్యాచారి ఆలపించారు.

వర్షార్పణం

- ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలు నీటిపాలు
- నాలుగు రోజులుగా వీడని వాన
- పంట పొలాల్లో భారీగా నిలిచిన వర్షపునీరు
- పైర్లు, దిగుబడులు దెబ్బతింటాయంటున్న రైతులు



వర్షపు నీటిలో మునిగిన మినుము పంట



చింతలచెరువు వద్ద వేరుశనగ పంట పొలంలో నిలిచిన వర్షపునీరు



చాగలమర్రి వద్ద తడిసిన మొక్కజొన్నలను రోడ్డుపై ఆరబోసిన దృశ్యం

చాగలమర్రి: దిగుబడులు చేతికొచ్చే సమయం, కొందరు ఇటీవల సాగు చేసిన పంటలు కురుస్తున్న వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన పంటలు ప్రస్తుతం కోత దశలో ఉన్నాయి. ముందస్తుగా సాగు చేసిన మొక్కజొన్న నూర్పిళ్లు సాగుతున్నాయి. దీంతో దిగుబడులను కొందరు రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోస్తున్నారు. ఈ సమయంలో వర్షం కురవడంతో ధాన్యం తడిపోయి మొలకలొస్తున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలుపోక రైతన్నలు విలపిస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిల్వ చేరడంతో రైతులు కుదేలయ్యారు. భారీ వర్షాలకు మండలంలో ఉల్లి, కంది, మినుము, వేరుశనగ, జొన్న, బెండ, మొక్కజొన్న తదతర పంటలు దెబ్బతిన్నాయి.ఆరబోసిన మొక్కజొన్న గింజలు వర్షానికి తడవడంతో ఫంగస్ సోకి నలుపు రంగులోకి మారాయి. ఉల్లి, వేరుశనగ, వరి పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షంతో భారీగా నష్టపోయామని చెబుతున్నారు.

బాధలు ఎవరికి చెప్పుకోవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటలు నష్టపోతే రైతుభరోసా కార్యాలయాల్లోని అధికారులు వెంటనే నష్ట తీవ్రతను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపేవారు. దీంతో వెంటనే ప్రభుత్వం పరిహారం మంజూరు ఆదుకునేది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు నష్టపోయాం. అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. రైతులను ఆదుకొని అండగా నిలవాలి.
– వెంకటేశ్వరరెడ్డి, రైతు , చింతలచెరువు గ్రామం

మొక్కజొన్న తడిసిపోయింది



ఆరుగాలం కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంట దిగుబడి చేతికందిందనే సంతోషంలో ఉండగా.. భారీ వర్షాలకు తడిసిపోసింది. నాకున్న 4 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టి కమర్షియల్ మొక్కజొన్న పంటను సాగు చేశా. సుమారు 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఖర్చు చేసిన మొత్తం పోనూ లాభం వస్తుందని అనుకున్నా. ధాన్యం ఆరబెట్టుకోవడానికి సరైన సౌకర్యం లేకపోవడంతో చాగలమర్రి వద్ద బీటీ రోడ్డుపై అరబెట్టాం. వర్షం కురుస్తుండటంతో పట్టలు కప్పినా వర్షానికి తడిసిపోయి గింజలకు ఫంగస్ సోకి నల్లగా మారాయి. – శీల్ల సురేష్ బాబు, రైతు, ఇడమదక

అంగన్‌వాడీ కేంద్రాలకు నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యాయని సూపర్‌వైజర్ సువర్ణలత గురువారం తెలిపారు. కోటపాడు, వనికినిదిన్నె, చెన్నూరు, ఇసుకపల్లె, మోత్కలపల్లె, బోయలకుంట్ల, గుంప్రమాన్‌దిన్నె, గాంధీనగర్, పచ్చర్ల కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. కేంద్రాల్లో తాగు నీటి సదుపాయం కల్పన, మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.36 వేలు, రూ.16 వేల చొప్పున మంజూరయ్యాయని చెప్పారు.

మరోమారు మార్కెట్ వేలం వాయిదా

నంద్యాల(సిటీ): నంద్యాల కూరగాయల మార్కెట్‌కు సంబంధించి బహిరంగ వేలం మరోమారు వాయిదా పడింది. ఇప్పటికి ఇది ఆరోసారి. గురువారం స్థానిక మున్సిపల్ రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. అయితే సరైన పోటీ లేకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే అధికారులు వేలం కోసం యాడ్స్ (పత్రికా ప్రకటనలకు)రూపంలో, మైక్ అనౌన్స్‌మెంట్‌లకు లక్షలాది రూపాయలు వృథా చేసినట్లు తెలుస్తోంది. కానీ సరైన రీతిలో వ్యాపారులకు అవగాహన కల్పనలో విఫలం అయ్యారనే చర్చ ప్రజల్లో సాగుతోంది.

వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: పల్లె పండుగలో సీసీ రోడ్ల శంకుస్థాపనకు వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలు, మండల ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. సమావేశంలో డ్వామా పీడీ జనార్దన్ రావు, హౌసింగ్ ఈఈ హరిహర గోపాల్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్లకు వర్క్ ఐడీ వారీగా వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. మండలానికి వెయ్యి చొప్పున సోక్ పిట్స్, ఎగువ ప్రాంతాల్లో ఫాంపాండ్స్, వందరోజుల పని దినాలు, గోకులం షెడ్లు, రూఫ్ వాటర్ స్ట్రక్చర్ నిర్మాణాలు, నర్సరీలు, పల్లె వనాల పనులకు ప్రతిపాదనలు సమర్పించి పరిపాలన ఉత్తర్వులు పొందాలని సూచించారు. వచ్చేవారం నుంచి సంబంధిత అంశాలపై సమీక్షిస్తానన్నారు.

శ్రీకృష్ణదేవరాయలుకు చరిత్రలో ప్రత్యేక స్థానం



ఆళ్లగడ్డలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బలిజ సంఘం నాయకులు

ఆళ్లగడ్డ: శ్రీకృష్ణదేవరాయలు పాలనా దక్షుడిగా, సమైక్యతా భావాలను పెంపొందించిన మహనీయుడిగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఎదురుగానున్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నల్లగట్ల బాలుడు, మైలేరి మల్లయ్య, సిద్ది సత్యం, రాందాసు, వెంకటసుబ్బయ్య, వీరయ్య తదితరులున్నారు.

ఉయ్యాలవాడ : శ్రీ కృష్ణదేవరాయుల 426వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కమతం బజార్‌లో నున్న ఆయన విగ్రహానికి గురువారం బలిజ సంఘం నాయకులు నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆయన పాలన ఎన్నటికీ ఆదర్శమని, నేటి పాలకులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు జింకా వెంకటస్వామి, కోశాధికారి అర్జిగారి నరసింహులు, కమతం చిన్న రాముడు, ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, తొలిశన్న, కొండయ్య పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీసాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠ



బొమ్మలసత్రంలో పునః నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయం



ఆలయంలో ప్రతిష్ఠించిన షిర్డీసాయినాథుడి విగ్రహం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని బొమ్మలసత్రంలో శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రాతఃకాల పూజ, ప్రతిష్ఠ హోమాలు, కల్యాణహోమం, యంత్ర ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. మహాగణపతి, శ్రీదత్తాత్రేయ, శ్రీకృష్ణ, శ్రీవల్లి దేవసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం బాబా మూల విరాట్‌కు అభిషేకం, అలంకరణ, మంగళ హారతి ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు, భక్తుల సహకారంతో రూ.3 కోట్లకు పైగానే ఖర్చు చేసి ఆలయ పునః నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠ చేపట్టామన్నారు. ఆలయ పునఃనిర్మాణంలో దాతల సహకారం మరువలేమన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, నాగేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు..మూడు కార్యక్రమాలు

- మండల సర్వ సభ్య సమావేశం
- రెండు గ్రామాల్లో పల్లె పండుగ
- జీపీడీపీ శిక్షణ కార్యక్రమం

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ అధికారులు అధికారికంగా మూడు కార్యక్రమాలు ఒకే రోజు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు ఇప్పటికే సమాచారం అందించారు. ఈ నెల 9వ తేదీన పల్లె పండుగ కార్యక్రమం షెడ్యూల్ ఖరారు చేశారు. 18వ తేదీన రుద్రవరంలో పల్లె పండుగ కార్యక్రమం ముగియనుంది. అదే రోజు మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ ఖరారు చేసి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం చేరవేశారు. ఆ రెండు కార్యక్రమాలతో పాటు అదే రోజు ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు జీపీడీపీ (గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్ని పంచాయతీల నుంచి పాల్గొనాలని సమాచారం అందజేశారు. ఒకే రోజు మూడు కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. గత మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 6న నిర్వహించారు. తిరిగి 90 రోజుల లోపు నిర్వహించాల్సి ఉండగా 77 రోజులకే నిర్వహించడంలో ఆంతర్యం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా మండల మీట్ మధ్యాహ్నం మూడు గంటల వరకు జరుగుతుంది. అయితే మిగిలిన కార్యక్రమాలను ఎప్పుడు నిర్వహిస్తారని, ఒకేసారి అన్ని కార్యక్రమాలు ఎందుకు నిర్వహిస్తున్నారని కొందరు ప్రజా ప్రతినిధులు ఎంపీడీఓను ప్రశ్నించగా.. సమాధానం కొరవడిందని వాపోయారు. కార్యక్రమాలపై ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా అనుకోకుండా తప్పని సరిగా నిర్వహించాల్సి వస్తోందని ఆమె వివరణ ఇచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: భారీ వర్షాల కారణంగా కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుందని పరివాహక ప్రాంత వాసులంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కుందూనదిని పరిశీలించారు. నదిలో భారీ ప్రవాహం ఉన్నందున రైతులు వంతెనపై వెళ్లరాదన్నారు. అలాగే మట్టిమిద్దెలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు.

లోకకల్యాణార్థం పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మా స్పటిక లింగేశ్వరాలయంలో ఆశ్వీయుజ మాస పౌర్ణమిని పురస్కరించుకుని లోకకల్యాణార్థం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అచల పరిపూర్ణ యోగానంద పాములేటి స్వామి ఆశీస్సులతో యోగానంద ఆధ్వర్యంలో అమ్మా స్పటిక లింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ, తిమయ్య, అనిల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



క్రిష్టిపాడులో భూమిపూజ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: పల్లెపండుగలో భాగంగా మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఎంపీడీఓ సావిత్రి, పీఆర్ ఏఈ వెంకటరెడ్డి, సర్పంచ్ శివరామిరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, కట్టుబడిబాషా, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, వీఆర్‌ఓ సాంబశివుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ. 33 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, హరివరం గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కర్రా రాధమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డి వెంకటేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప అన్నారు. గురువారం వనికినిదిన్నె, జీనేపల్లె, గుంప్రమాన్‌దిన్నె, గాంధీనగరంలలో పల్లెపండుగ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రూ.75 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.తహసీల్దార్ పుష్పకుమారి, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచులు దగడ మహేశ్వరి పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామాల్లో పల్లె పండుగ- పంచాయితీ వారోత్సవాలు కార్యక్రమం గురువారం నెహ్రూనగర్, జిల్లెల్ల గ్రామాల్లో నిర్వహించారు. నెహ్రూనగర్‌లో 100 మీటర్లకు రూ.5 లక్షలు, జిల్లెల్లలో 700 మీటర్లకు రూ.35 లక్షల నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్డీ నాగఅనసూయ పాల్గొన్నారు.

రామాయణం.. సమస్త మానవాళికి ఆదర్శం



మహర్షి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ



నంద్యాలలో మహర్షి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



దొర్నిపాడులో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ సావిత్రి, అధికారులు



రుద్రవరంలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల: వాల్మీకి రచించిన రామాయణం మహాకావ్యం సమస్త మానవాళికి ఆదర్శమని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. గురువారం నంద్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శ్రీవాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్మ్డు రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు మంజునాథ్, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి

నంద్యాల(అర్బన్): ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, కార్యదర్శి లాలు స్వామి ఆధ్వర్యంలో వాహనాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి బొగ్గులైన్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా దేవనగర్‌లోని వాల్మీకి మహర్షి, బస్టాండ్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

దొర్నిపాడు: మండలంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, ఏఓ నారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, సీనియర్ అసిస్టెంట్ పద్మజ, పీఎస్ ఓబులేసు, కిశోర్ పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అలాగే అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆయన చిత్ర పటాలను గ్రామాల్లో ఊరేగించారు.

భారీ వర్షం

- చాగలమర్రిలో 26.2 మి.మీ వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపులోనే పంట పొలాలు
- ఆందోళనలో రైతులు



దొర్నిపాడు శివారులో మూడురోజులుగా నీటిలోనే ఉన్న జొన్న పైరు



నగళ్లపాడు వద్ద వృక్షంపై పిడుగు పడిన స్థలాన్ని చూపుతున్న లక్ష్మీఓబులేసు



హరివరంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు


దొర్నిపాడు: తుపాను పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. నాలుగు రోజులుగా విరామం లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మినుము, మిరప, పత్తి, జొన్న, మొక్కజొన్న పైర్లు ఇంకా ముంపులోనే తేలాడుతున్నాయి. పంటలు చేతికి వచ్చే పరిస్థితి దాటిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

చాగలమర్రి: మండలంలో బుధవారం రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో గురువారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో 26.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నగళ్లపాడు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనున్న హజ్రత్‌ఇమాంవలి దర్గా ఎదురుగా ఉన్న జీవీ వృక్షంపై పిడుగు పడటంతో చెట్టులోకి చొచ్చుకెళ్లింది.పిడుగు తీవ్రతకు చెట్టు కింది భాగంలో పెద్ద గుంత పడగా.. అరుగు బండలు ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న విద్యుత్తు తీగలు కాలిపోయాయి.

రుద్రవరం: మండలంలో ఐదు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. గురువారం ఉదయం వర్షం కురవడంతో రైతులు సాగు చేసిన జొన్న,మొక్కజొన్న,మినుము వంటి పంటల్లో నీరు నిలిచి దెబ్బ తింటున్నాయి. పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు,చందలూరు తదితర గ్రామాల్లో ఇటీవల సాగు చేసిన జొన్న పంట నీట మునిగాయి. రుద్రవరం,అప్పనపల్లె,పెద్దకంబలూరు,ఎల్లావత్తుల,నర్సాపురం తదితర గ్రామాల్లో ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. డీ.కొట్టాల, చిత్రేనిపల్లె తదితర గ్రామాల పరిధిలో ముందస్తుగా సాగు చేసిన వరి పంట కాలం పూర్తి కావచ్చింది.అయితే ఐదురోజులుగా కురిసిన వర్షానికి పైరు నేలవాలింది.

ఉయ్యాలవాడ : మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, కంది, వరి, సీడు పత్తి, పొగాకు తదితర పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు తహసీల్దార్ శ్రీనివాసులు అన్ని గ్రామాల్లో టాంటాం వేయించారు. మండల కేంద్రం సమీపంలో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుంది. భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో హరివరం గ్రామంలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నీరంతా రహదారిపైనే ప్రవహించింది.

కూలిన మట్టి మిద్దె



చాగలమర్రి గుంతపాలెం వీధిలో కూలిన మట్టి మిద్దె

చాగలమర్రి: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి మిద్దెలు కూలిపోతున్నాయి. గురువారం కురిసిన వర్షానికి స్థానిక 19వ వార్డులోని గుంతపాళెం వీధిలో జింక చిన్న ఉశేన్‌వలికి చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. కుటుంబ సభ్యులు బయట నిద్రిస్తుండగా తెల్లవారుజామున పైకప్పు కూలిపోయింది. దీంతో ప్రమాదం తప్పింది.